సాక్షి కర్నూలు
ఆదివారం । 18 । ఆగస్టు । 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద వితరణ పథకానికి శనివారం హైదరాబాద్‌కు చెందిన సంపంగి మాధురి రూ.1,00,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకురాలు డి.స్వర్ణలతకు అందజేశారు.



శ్రీశైలంలో భారీ వర్షం

శ్రీశైలం: శ్రీశైలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు మెరుపులతో గంటన్నర పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో రహదారులు జలమయ్యాయి.



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	: 73
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 55,343
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	:12,948

న్యూస్‌రీల్

రెవెన్యూ సదస్సులపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): రెవెన్యూ సదస్సులను సెప్టెంబర్ మొదటి వారంలో అన్ని గ్రామాల్లో నిర్వహించాల్సి ఉందని, వీటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఎంపీడీఓలు, తహసీల్దార్లతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వంద రోజులు ప్రణాళికల లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. ఓటరు జాబితాలో సవరణ కోసం బూత్ లెవల్ ఆఫీసర్లు ఈనెల 20 నుంచి ఇంటింటా తిరగాలన్నారు. అక్టోబర్ 29న ముసాయిదా జాబితాను విడుదల చేయాలన్నారు. అక్టోబర్ 2 నాటికి సాలిడ్ వేస్టు మేనేజ్‌మెంట్ షెడ్లు నిర్వహణలోకి రావాలని ఆదేశించారు. వంద రోజుల్లో 6,079 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని, ఓడీఎఫ్ ప్లస్‌లోకి 60 గ్రామ పంచాయతీలను తీసుకు రావాలని సూచించారు. జేసీ బి.నవ్య మాట్లాడుతూ.. సెప్టెంబర్ 15 నాటికి ఈ క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, ఆర్డీఓలు ఎం.శేషిరెడ్డి, రామలక్ష్మి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికనే బదిలీలు

- ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన ఉద్యోగులకు బదిలీ తప్పనిసరి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం 15 శాఖల్లో బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసింది. ఈనెల 19 నుంచి 31వ తేదీ వరకు బదిలీలు చేపట్టేలా ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఒక్క ఎక్సైజ్ శాఖకు మాత్రం సెప్టెంబర్ 15వ తేదీ వరకు బదిలీలకు అవకాశం కల్పించింది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన చేపట్టనున్న బదిలీల్లో ఆయా శాఖల్లో ఐదేళ్లు పనిచేసిన ఉద్యోగులకు కచ్చితంగా స్థానచలనం కలగనుంది. అయితే పరిపాలనా సౌలభ్యం, ఉద్యోగుల అభ్యర్థన.. ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని కొందరికి వెసలుబాటు కల్పించే అవకాశం కూడా ఉంది. ఈ అంశాలను టీడీపీ ప్రభుత్వం తమకు అనుకూలంగా మలుచుకోనున్నట్లు చర్చ జరుగుతోంది. ఇదిలాఉంటే సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరిగిన బదిలీల స్టేషన్ ఆధారంగా కాకుండా, అంతకు ముందు పనిచేసిన ప్రాంతాన్నే బదిలీలకు పరిగణనలోకి తీసుకోనున్నారు. దివ్యాంగులు, మహిళలు, ఐటీడీఏల్లో కొన్ని మినహాయింపులు కల్పించారు.

కర్నూలు మున్సిపల్ కమిషనర్‌గా విద్యాధరి



కర్నూలు (సిటీ): కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్‌గా గొబ్బిల విద్యాధరిని నియమించారు. ఈమె 2021 ఐఏఎస్ క్యాడర్‌కు చెందిన వారు. ఈమె స్వస్థలం వైఎస్సార్ జిల్లా నందలూరు మండలం గొల్లపల్లె. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరు సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వస్తున్నారు. ప్రస్తుతం కర్నూలు ఇన్‌చార్జ్ మున్సిపల్ కమినర్‌గా రామలింగేశ్వర్ వ్యవహరిస్తున్నారు.

- ఆదోని సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న శివనారాయణ శర్మ అనంతపురం జాయింట్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. అయితే ఈయన స్థానంలో ఎవరినీ నియమించలేదు.

రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహిస్తామని, అక్కడ కూడా ఫిర్యాదులను అందజేయవచ్చన్నారు.

15 మండలాల్లో వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ మండలాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షం కురిసింది. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు 15 మండలాల్లో వర్షాలు పడ్డాయి. అత్యధికంగా చిప్పగిరిలో 62.8 మి.మీ, అత్యల్పంగా నందవరంలో 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తం సగటున 11.9 మి.మీ వర్షపాతం నమోదయింది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ ఉండగా.. ఇప్పటి వరకు 62.5 మి.మీ వర్షం కురిసింది. అంటే 46 శాతం లోటు వర్షపాతం ఉంది. అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నా ఎండల తీవ్రతతో పాటు ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

తస్మాత్ జాగ్రత్త.. కర్ణాటక దొంగల ముఠా నంద్యాలకు చేరింది. ఓ హత్య ఘటనతో 'ముఠా' గుట్టు రట్టయింది. హత్య కేసు ఛేదించేందుకు ముఠాలోని సభ్యులను విచారిస్తే వారంతా 'దొంగల ముఠా' అని తేలింది. కొందరిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా, ఇంకొందరు పరారయ్యారు. ఈ ముఠాకు నంద్యాల వాసులతో సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే కర్ణాటక, తెలంగాణలో కూడా వీరు దొంగతనాలకు పాల్పడినట్లు సమాచారం. వీరిపై చాలా కేసులు ఉన్నాయి. ఈ 'ముఠా' దొంగతనాలు చేసే విధానం, వ్యవహరించే తీరు చూస్తే అచ్చం ఉత్తరప్రదేశ్‌లోని 'పార్థీగ్యాంగ్'ను తలపిస్తుండటం గమనార్హం. – సాక్షి ప్రతినిధి కర్నూలు



పగలు కన్నేస్తారు.. రాత్రి దోచేస్తారు!

ఉమ్మడి జిల్లాలో కర్ణాటక దొంగలు

- చోరీలకు వచ్చి పాణ్యంలో శ్యామ్ అనే దొంగ హత్య
- కేసును ఛేదించే క్రమంలో పోలీసులకు విస్తుపోయే వాస్తవాలు
- ఒంటరి మహిళలున్న ఇళ్లు, తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్
- దుప్పట్లు, బొమ్మలు అమ్మేవారిగా ఉదయం రెక్కీ, రాత్రికి చోరీ
- అచ్చం 'పార్థీ' గ్యాంగ్ తరహాలోనే దొంగతనాలు

కర్ణాటక నుంచి ఓ దొంగల ముఠా ఈ నెల 9న నంద్యాలకు చేరుకుంది. అక్కడ నూనెపల్లిలోని ఓ వ్యాపారి వద్ద గంజాయి కొనుగోలు చేశారు. వీరికి ఇక్కడ కొందరితో మంచి పరిచయాలు ఉన్నాయి. వారివద్దే ఆశ్రయం పొందారు. అయితే ఈ దఫా కర్ణాటకలో ఓ దొంగతనం చేసి ఇక్కడికి వచ్చారు. నంద్యాల నుంచి పాణ్యం సమీపంలోని ఎస్ఆర్‌బీసీ కాలువ సమీపంలోకి చేరుకున్నారు. అక్కడ మద్యం, గంజాయి సేవించారు. 'శ్యామ్, సాగర్' అనే ఇద్దరు దొంగలు(బావా బామర్దులు) ఓ దొంగతనం విషయంలో వాదులాడుకున్నారు. మాటామాట పెరిగింది. దీంతో సాగర్ రివాల్వర్‌తో శ్యామ్‌ను కాల్చడంతో అక్కడికక్కడే చనిపోయాడు. ఆ తర్వాత అతని గొంతు కూడా కోశాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సాగర్‌తో పాటు మరో నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిసింది. అయితే ఈ హత్య కేసుపై మాత్రమే పోలీసులు విచారణ చేశారు. సాగర్ హత్య చేసినట్లు గుర్తించి.. తక్కిన నలుగురిని వదిలేసినట్లు సమాచారం. వీరితో పాటు మరో ఆరుగురు దొంగల బృందం కూడా వీరితో నంద్యాలకు వచ్చినట్లు తెలిసింది.



కాల్పుల్లో మృతిచెందిన శ్యామ్

వ్యాపారుల్లా ఇళ్లకు వచ్చే దొంగల ముఠా

పోలీసుల విచారణలో ఈ ముఠా గురించి విస్తుపోయే వాస్తవాలు తెలిసినట్లు తెలుస్తోంది. చనిపోయిన శ్యామ్‌పై 40 పైగా దొంగతనాల కేసులు ఉన్నట్లు సమాచారం. శ్యామ్ దొరికి పోలీసులు పెట్టిన కేసులు మాత్రమే ఇవి! పోలీసులకు తెలియకుండా చేసిన దొంగతనాలు లెక్కలేవు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రలో వీరు చోరీలకు పాల్పడేవారని తెలుస్తోంది. వీరి వృత్తే దొంగతనాలు. దుప్పట్లు, బొమ్మలు, ఇతర వస్తువులు విక్రయించే వారిలా వీధుల్లో తిరిగి తాళాలు వేసిన ఇళ్లు, ఒంటరి మహిళలు ఉన్న ఇళ్లు పగలు గుర్తిస్తారు. ఈ ఇళ్లు లక్ష్యంగా 'ముఠా' మొత్తం వచ్చి రాత్రికి దోపిడీ చేస్తారు. చోరీ సమయంలో అడ్డుపడితే గాయపరచడం, చంపడం కూడా చేస్తారు. నగదు, డబ్బు కొల్లగొట్టి వెళ్తారు.

నంద్యాల గంజాయి ముఠాతో సంబంధాలు

ఈ గ్యాంగ్‌కు నంద్యాల నూనెపల్లిలో గంజాయి విక్రయించే ముఠాతో సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. వీరు ఇక్కడ తిరిగేందుకు వాహనాలు కూడా ఇక్కడ వ్యక్తి అందించేవారని సమాచారం. ఏడాది కిందట ఇతనిపై పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. వైజాగ్ నుంచి నంద్యాలకు గంజాయి దిగుమతి చేసుకుని బండి ఆత్మకూరు మండలం ఎ.కోడూరు, ఆత్మకూరు, పాణ్యం దొంగుకు తరలించారు. ఈ కేసులో ఖాసీంబీ దంపతులు, నంద్యాలలో దస్తగిరి అనే మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. గంజాయి ముఠాతో సంబంధాలు ఉండటం చూస్తే గతంలో నంద్యాల, కర్నూలు జిల్లాలలో జరిగిన దొంగతనాలలో కూడా వీరి పాత్ర ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

రైల్వే దొంగతనాలు కూడా..

ఈ దొంగల ముఠా ఇళ్ల దొంగతనాలు ఎక్కువగా చేస్తుంది. దీంతో పాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లి రైల్వే దొంగతనాలు కూడా చేస్తారని తెలుస్తోంది. సిగ్నల్ ట్యాంపరింగ్‌కు పాల్పడి రైళ్లలో చోరీ చేస్తారని సమాచారం. సిగ్నల్ ట్యాంపరింగ్ ఎక్కడ చేయొచ్చు? ఏ దారిలో ఎక్కువ రైళ్లు వెళతాయి. ఎక్కడ దొంగతనం చేస్తే తప్పించుకునే అవకాశం ఉంటుందనేది పక్కా రెక్కీతో ప్లాన్ చేసి దొంగతనాలు చేయడం వీరి ప్రత్యేకత. అయితే ఇటీవల రైలు దొంగతనాలు మన ప్రాంతంలో చేయలేదు. ఇతర రాష్ట్రాల్లో రైలు దొంగతనాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. నిజానికి ఈ తరహా దొంగతనాలన్నీ మహారాష్ట్రలోని షోలాపూర్ దొంగలు, ఉత్తర ప్రదేశ్‌లోని 'పార్థీగ్యాంగ్' చేస్తుంది. అచ్చం ఆ తరహాలోనే రెక్కీ నిర్వహించి దొంగతనాలు చేయడం చూస్తే వీరు 'పార్థీగ్యాంగ్'కు లోకల్‌గా సహకారం అందించి, వారితో కలిసి దొంగతనాలు చేసి ఉంటారని, ఆ అనుభవంతో ఓ ముఠాగా ఏర్పడి సొంతంగా దొంగతనాలు చేస్తున్నారని తెలుస్తోంది.

రివాల్వర్ ఎక్కడ?



శ్యామ్ అనే దొంగను తన బావ సాగర్ హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు తెలుస్తోంది. ఈ హత్యకు వాడిన రివాల్వర్‌ను ఎస్ఆర్‌బీసీలో పడేశారని మొదట చెప్పారు. పోలీసులు నీరు తగ్గించి దాని కోసం వెతికారు. అయినా ఫలితం లేకపోయింది. ఇప్పుడు సమీపంలోని ముళ్లపొదల్లో వేశానని చెప్పినట్లు తెలిసింది. ఇలా రోజుకో చోటు చెప్పి పోలీసులను దారితప్పేలా చేస్తున్నట్లు సమాచారం. దొంగల ముఠాలో రివాల్వర్‌లు కూడా ఉన్నాయంటే వీరు ఏ స్థాయిలో దొంగతనాలు చేస్తారో? అవసరమైతే ఎంతకు తెగిస్తారో స్పష్టమవుతోంది. కాబట్టి గుర్తు తెలియని వ్యక్తులు వీధుల్లోకి తిరిగే సమయంలో ఒంటరిగా ఉన్న మహిళలు, ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లే వాళ్లు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రత్యామ్నాయ పంటల సాగుకు విత్తనాలు

- 80 శాతం సబ్సిడీపై పంపిణీకి చర్యలు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రత్యామ్నాయ పంటల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం 1,580 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించింది. వీటిని 80 శాతం సబ్సిడీపై పంపిణీ చేయనున్నారు. జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 4.19 లక్షల హెక్టార్లు ఉండగా.. 3.14 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. వర్షాలు సకాలంలో పడకపోవడంతో 1.05 లక్షల హెక్టార్ల భూములు ఖాగీగా ఉండిపోయాయి. అయితే 20,500 హెక్టార్ల భూములకే ప్రత్యామ్నాయ పంటల సాగుకు విత్తనాలు కేటాయించడం పట్ల ఆందోళన వ్యక్తం అవుతోంది. 863 క్వింటాళ్ల జొన్న(మహేంద్ర సీఎస్‌హెచ్ 56, ఎన్‌టీజే-5 రకాలు). 260 క్వింటాళ్లు కొర్ర(సూర్యనంది ఎస్ఐఏ 3088 రకం), 375 క్వింటాళ్ల ఉలవలు, 82 క్వింటాళ్ల సజ్జ(502 నూజివీడు హైబ్రిడ్) విత్తనాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. విత్తనాలను ఏపీసీడ్స్ సరఫరా చేస్తుంది. అయితే ఏపీసీడ్స్ దగ్గర ఈ విత్తనాలు లేకపోవడంతో ఒకటి, రెండు రోజుల క్రితమే టెండర్లు పిలిచింది. టెండర్లు ఖరారు అయిన తర్వాత ఏపీసీడ్స్‌కు విత్తనాలు సరఫరా అవుతాయి. దీంతో ప్రత్యామ్నాయ పంటల సాగుకు విత్తనాలు ఇప్పట్లో అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు.

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి

- జిల్లా జడ్జి కబర్ధి

కర్నూలు (లీగల్): జాతీయ లోక్ అదాలత్‌ను సెప్టెంబర్ 14వ తేదీన నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.కబర్ధి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, పోలీసు అధికారులు, ఇన్సూరెన్స్, బ్యాంకు, మున్సిపల్, భూసేకరణ, ఇతర అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టులలో పెండింగ్ ఉన్న, రాజీ కాదగిన కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, మోటార్ యాక్సిడెంట్, సివిల్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో నాలుగో అదనపు జిల్లా జడ్జి శ్రీమతి జి.ప్రతిభాదేవి, ఆరో అదనపు జిల్లా న్యాయమూర్తి పి.పాండురంగారెడ్డి, శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకటహరినాథ్, బార్ ప్రెసిడెంట్ బి.కృష్ణమూర్తి, కర్నూలు డీఎస్పీ జె.బాబు ప్రసాద్, స్పెషల్ కలెక్టర్ వెంకటనారాయణమ్మ, ఇతర న్యాయమూర్తులు పాల్గొన్నారు.



రాజ్‌విహార్ సెంటర్‌లో వైద్య విద్యార్థుల మానవహారం



కర్నూలులో జూనియర్ డాక్టర్ల ర్యాలీ

జూడాల సమ్మె ఉధృతం

- జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, రాస్తారోకోలు
- మద్దతు తెలిపిన వైద్యులు, మెడికల్ రెప్‌లు, ప్రజాసంఘాల నాయకులు
- వైద్య విద్యార్థిని హత్యాచారం చేసిన వారిని శిక్షించాలని డిమాండ్

కర్నూలు(హాస్పిటల్): పశ్చిమబెంగాల్ రాష్ట్రం కోల్‌కతలోని ఆర్‌జి కార్ హాస్పిటల్‌లో హత్యాచార ఘటనకు నిరసనగా జూనియర్ డాక్టర్లు సమ్మెను ఉధృతం చేశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వైద్యులు ఆందోళనలు నిర్వహించారు. ర్యాలీలు, రాస్తారోకోలతో తమ గళాన్ని వినిపించారు. కర్నూలులో జూనియర్ డాక్టర్లు విధులు బహిష్కరించి కలెక్టరేట్ నుంచి రాజవిహార్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ అరగంటకు పైగా మానవహారంగా ఏర్పడి రాస్తారోకో చేశారు. అనంతరం తిరిగి వారు కలెక్టరేట్ చేరుకుని అక్కడి నుంచి ఆసుపత్రిలోని ధర్నా శిబిరానికి వెళ్లారు. ఈ సందర్భంగా జూడాలు మాట్లాడుతూ.. వైద్య విద్యార్థినిపై అఘాయిత్యానికి పాల్పడినది డాక్టర్లేనని చర్చ నడుస్తోందని, తప్పు చేసింది ఎవ్వరైనా సరే వారికి శిక్ష పడాల్సిందేనని డిమాండ్ చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే దేశ్యాప్తంగా తక్షణం సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలన్నారు. ఆసుపత్రి ఆవరణలో స్టేట్ స్పెషల్ పోలీస్ ప్రొటెక్షన్ ఫోర్స్‌ను నియమించాలన్నారు. డ్యూటీలో ఉన్న వైద్యులకు విశ్రాంతి గదులను నిర్మించి, హాస్పిటల్, హాస్టల్ పరిధి మొత్తం సీసీ టీవీలు, లైట్లు తక్షణం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వైద్యులు, దంత వైద్యుల సంఘీభావం

జూడాలు నిర్వహిస్తున్న ఆందోళనకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లలో ఓపీ సేవలను 24 గంటల పాటు నిలిపివేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ ఒక గంట పాటు ఉదయం ఓపీ నిలిపివేశారు. కర్నూలులో కలెక్టర్, ఎస్పీ, పెద్దాసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ రాయపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో దంత వైద్యులు గాంధీ నగర్ నుంచి రాజవిహార్ వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. కలెక్టరేట్ వద్ద ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ నాయకులు ధర్నా నిర్వహించారు. ధర్నా శిబిరంలో జూడాలకు ఎస్ఎఫ్ఐ, ఐద్వా జిల్లా కమిటీ నాయకులు కలిసి మద్దతు తెలిపారు. అనంతరం వారు కలెక్టరేట్ వద్ద వైద్య విద్యార్థినికి మృతికి సంతాపంగా కొవ్వొత్తులు వెలిగించారు.

23న 'ఉపాధి హామీ' గ్రామ సభలు

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ డైరెక్టర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 23న ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన గ్రామసభలు నిర్వహించాలని డీపీఓ నాగరాజు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయా గ్రామ సభల్లో సర్పంచు, వార్డు సభ్యులు, రైతులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో పాటు ఉపాధి కూలీలు, గ్రామాల్లో పనిచేస్తున్న ఆయా శాఖల సిబ్బంది పాల్గొనాలన్నారు. ఇప్పటిదాకా ఈ పథకం ద్వారా గ్రామంలో చేసిన పనుల వివరాలను, అదే విధంగా 2024-25వ ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనులకు గ్రామ సభ ఆమోదం తీసుకుంటారని పేర్కొన్నారు.

ఉపాధి నిధులపై 'తమ్ముళ్ల' కన్ను

- ఒక్కో నియోజకవర్గంలో రూ.10 కోట్ల అంచనాతో పనులు
- పనుల మంజూరుకు సర్పంచుల తీర్మానం తప్పనిసరి
- తీర్మానాలు చేయాలని టీడీపీ నేతల ఒత్తిళ్లు
- ఇప్పటి వరకు రూ.68.07 కోట్లకు అందిన ప్రతిపాదనలు

నియోజకవర్గాల వారీగా ఇప్పటి వరకు అందిన ప్రతిపాదనలు ...

నియోజకవర్గం	మొత్తం (రూ.కోట్లలో)
ఆదోని	7
ఆలూరు	16.55
మంత్రాలయం	10.71
ఎమ్మిగనూరు	14.63
పత్తికొండ	10.11
పాణ్యం (ఓర్వకల్లు, కల్లూరు మండలాలు)	4.67
కోడుమూరు (గూడురు, సీ బెళగల్ మండలాలు)	4.40
మొత్తం:	రూ.68.07

కర్నూలు(అర్బన్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు కొల్లగొట్టేందుకు టీడీపీ నాయకులు కార్యాచరణ రూపొందించుకుంటున్నారు. ఈ పథకం కింద పనులు చేసేందుకు తీర్మానాలు చేయాలని సర్పంచులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో తీర్మానాలు లేకుండానే పనులు చేసేందుకు అంచనాలను అధికారులకు పంపారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో అభివృద్ధి పనులు (సీసీ రోడ్లు, డ్రైన్లు) చేపట్టేందుకు ఒక్కో నియోజకవర్గానికి రూ.10 కోట్ల విలువ చేసే పనులు మంజూరు కానున్నాయి. ఈ పనులకు సంబంధించి గ్రామ పంచాయతీ తీర్మానం చేసి, అంచనాలతో ప్రతిపాదనలు పంపాల్సి ఉంది. గ్రామ పంచాయతీ చేసిన తీర్మానాలను మండల స్థాయిలో కూడా ఆమోదించి జిల్లా పరిషత్‌కు పంపాల్సి ఉంటుంది. జిల్లాలోని మెజారిటీ గ్రామ పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలిచిన సర్పంచులు ఉన్నారు. దీంతో టీడీపీ నాయకులు పలు గ్రామ పంచాయతీల్లో నయానో, భయానో గ్రామ పంచాయతీ తీర్మానాలు తీసుకుంటున్నారు. కొన్ని పంచాయతీల్లో తెలుగుదేశం పార్టీకి చెందిన చోటామోటా నేతలు పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. మరి కొన్ని ప్రాంతాల్లో కొందరు అధికారులే సర్పంచులతో రాయబారాలు నడుపుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా గ్రామ పంచాయతీల తీర్మానాలు లేకుండానే జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి రూ.68.07 కోట్లకు ప్రతిపాదనలు అందినట్లు తెలుస్తోంది. పంచాయతీ తీర్మానం లేకుండా వచ్చిన ప్రతిపాదనలు ఆమోదానికి నోచుకుంటాయో, లేదో వేచి చూడాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. కాగా, ఇప్పటివరకు ఆదోని, ఆస్పరి మండలాల్లోని గ్రామ పంచాయతీల తీర్మానాలు మాత్రమే పీఆర్ ఎస్ఈ కార్యాలయానికి అందాయి.

కార్యదర్శుల ద్వారా ఒత్తిడి చేయిస్తున్నారు



గ్రామంలో పలు పనులు చేపట్టేందుకు తీర్మానాలు ఇవ్వాలని టీడీపీ నాయకులు పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఒత్తిడి చేయిస్తున్నారు. ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టేందుకు గ్రామంలో సర్పంచుకు అధికారాలు ఉంటాయి. టీడీపీ నాయకులు మా అధికారాలను హరించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎమ్మెల్యే గ్రాంట్ కింద చేపట్టే పనులను వారికి ఇష్టమొచ్చిన ప్రాంతంలో చేయించుకుంటే ఎవరికీ అభ్యంతరం లేదు. మా అధికారాలకు భంగం వాటిల్లితే న్యాయ పోరాటం చేసేందుకు సిద్ధమవుతాం. – కే కేశవరెడ్డి, సర్పంచు, చిన్నహుల్తి, పత్తికొండ మండలం

754 గ్రామ పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2021లో నాలుగు విడతలుగా మొత్తం 970 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించగా, సింహభాగం 754 గ్రామ పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో విజయం సాధించారు. మెజారిటీ గ్రామ పంచాయతీలన్నీ వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచుల ఏలుబడిలోనే ఉన్నందున గ్రామ పంచాయతీ తీర్మానాల కోసం తీవ్ర స్థాయిలో ఒత్తిడిని పెంచుతున్నారు. కాగా, గ్రామాభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే ప్రజావసరాలను గుర్తించి పనులు చేపడితే బాగుంటుందనే అభిప్రాయాన్ని పలువురు సర్పంచులు వ్యక్తం చేస్తున్నారు.

898 పనులకు ప్రతిపాదనలు అందాయి



జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఉపాధి నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి ఇప్పటి వరకు రూ.68.07 కోట్ల అంచనాతో 898 పనులకు ప్రతిపాదనలు అందాయి. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు గ్రామ పంచాయతీ తీర్మానం తప్పనిసరి. క్షేత్ర స్థాయిలోని ఇంజినీర్లు గ్రామ పంచాయతీ తీర్మానం, ప్రతిపాదించిన పనుల అంచనాలతో మాకు నివేదికలు పంపుతారు. వాటిని మరోసారి పరిశీలించి ఎస్ఈ ద్వారా డ్వామా పీడీకి పంపుతాం. – ఎస్‌సీఈ మద్దన్న, ఈఈ, పీఆర్

క్లుప్తంగా

నేడు పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

కర్నూలు (అర్బన్): ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఎన్నికలు ఆదివారం కోవెలకుంట్ల సమీపంలోని నయనాలప్ప దేవస్థానంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు సి.మురళీమోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని తాలూకా యూనిట్లు, జెడ్పీ యూనిట్ ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయని చెప్పారు. ఆదివారం ఉదయం 10:30 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై సాయంత్రం 4:15 గంటలకు ఓట్ల లెక్కింపుతో ముగుస్తుందన్నారు. లెక్కింపు అనంతరం విజేతల వివరాలను నోటీసు బోర్డులో ప్రచురిస్తామని తెలిపారు. తాలూకా, జెడ్పీ, రాష్ట్ర యూనిట్ సభ్యులు నామినేషన్ దాఖలు చేసేందుకు అర్హులని పేర్కొన్నారు. ఎన్నికలకు జిల్లాలోని ఓటర్లందరూ హాజరు కావాలని కోరారు.

ఫొటోగ్రాఫర్ దుర్మరణం


వెంకటేష్ (ఫైల్)

ఆదోని అర్బన్: గుర్తు తెలియని లారీ ఢీకొట్టడంతో ఫొటోగ్రాఫర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన శనివారం బైచిగేరి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బైచిగేరి గ్రామానికి చెందిన వెంకటేష్(27) ఆదోనిలో ఫొట్రోగాఫర్‌గా పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం పనులు ముగించుకుని స్వగ్రామమైన బైచిగేరికి బైకుపై వెళ్తుండగా ఎమ్మిగనూరు వైపు నుంచి గుర్తు తెలియని లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకటేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుని తండ్రి రాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతుడు వెంకటేష్‌కు భార్య మహేశ్వరి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రాణం తీసిన విద్యుదాఘాతం


మొండెం బోయ రామకృష్ణ (ఫైల్)

కృష్ణగిరి: మండల పరిధిలోని పెద్దొడ్డి గ్రామంలో శుక్రవారం రాత్రి విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ ఖాజావలి తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన మొండెం బోయ రామకృష్ణ(54) రాత్రి పొద్దుపోయాక బహిర్భూకి వెళ్లేందుకు డ్రమ్ములో నీరు తీసుకుని రేకుల కొట్టంపై చేయి పెట్టాడు. అప్పటికే చిన్నపాటి వర్షం పడటంతో కొట్టంపై ఉన్న విద్యుత్ వైరు నుంచి కరెంటు పాస్ అయ్యింది. విద్యుదాఘాతానికి గురై చేయి, మెడ భాగంలో గాయలు కాగా వెంటనే వైద్యం కోసం తరలించేందుకు ఏర్పాటు చేస్తుండగా అప్పటికే మృతిచెందాడు. మృతునికి భార్య రంగమ్మతోపాటు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. శనివారం భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామ సర్పంచ్ షేక్ షహనా, రఫీ సాహెబ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం వెల్దుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న మృతదేహాన్ని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి పరిశీలించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు.


ప్రమాదానికి కారణమైన బస్సు


ప్రమాదానికి గురైన లారీ

అదుపు తప్పిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

- డివైడర్ దాటి ఎదురుగా వచ్చే లారీని ఢీకొట్టిన వైనం
- బస్సు డ్రైవర్ దుర్మరణం
- లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్లను రక్షించిన పోలీసులు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు ట్రావెల్ బస్సు డ్రైవర్ దుర్మరణం చెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. డోన్ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆరెంజ్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు శుక్రవారం రాత్రి బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. మార్గమధ్యలో అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో డోన్ పట్టణంలోని ఓ హోటల్ వద్ద అదుపు తప్పి డివైడర్ ఆవలి వైపు దూసుకెళ్లి ఎదురుగా హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న లారీని వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా మంచిర్యాల మండలం మందమర్రి గ్రామానికి చెందిన సతీష్‌కుమార్ (28) అక్కడికక్కడే మృతి చెందగా, లారీ డ్రైవర్లు ముత్తుస్వామి, చిన్నస్వామిలకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన ఇద్దరు డ్రైవర్లను క్రేన్ సహాయంతో బయటకు తీశారు. గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన బస్సు, లారీని క్రేన్ల సహాయంతో పక్కకు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు. మృతుడు బస్సు డ్రైవర్‌కు భార్య హసీనాతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. లారీ డ్రైవర్ ముత్తుస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపారు.

ఎస్ఎంసీ ఎన్నికల్లో 'టీడీపీ' రగడ

- ఎన్నిక వాయిదా


వి. తిమ్మాపురంలో సర్దిచెబుతున్న పోలీసులు


తోవిలో ఎంఈఓతో తల్లిదండ్రుల వాగ్వావాదం

మంత్రాలయం: మండలంలోని వి.తిమ్మాపురం ఎస్ఎంసీ ఎన్నికల్లో టీడీపీ తమ్ముళ్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. శనివారం గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో ఎన్నిక జరిగింది. ఎన్నికలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, నియోజకవర్గ నాయకుడు రాఘవేంద్రరెడ్డి వర్గాల మధ్య గొడవ చోటు చేసుకుంది. తీవ్ర పోటీ నెలకొనడంతో చీటీల రూపంలో ఎన్నికలు నిర్వహించారు. అయితే పాఠశాల హెచ్ఎం నాగరాజు తిక్కారెడ్డి వర్గానికి చెందిన వ్యక్తికి మెజారిటీ ఉండటంతో చీటీని పారవేయబోయాడు. గమనించిన తిక్కారెడ్డి వర్గీయులు హెచ్ఎంతో గొడవకు దిగారు. రాఘవేంద్ర వర్గీయులు అడ్డుపడటంతో వాగ్వాదం ఎన్నిక వాతావరణం మారిపోయింది. ఎస్ఐ గోపీనాథ్ అక్కడికి చేరుకుని గొడవను సద్దు మణిగించారు. ఇరు వర్గాల గొడవ రీత్యా ఎన్నికను వాయిదా వేశారు.

తోవి ఎస్ఎంసీ ఎన్నిక వాయిదా

కౌతాళం: మండల పరిధిలోని తోవి గ్రామంలో ఎస్ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నిక మరో సారి వాయిదా పడింది. గత వారం వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు గెలుపొందడంతో టీడీపీ నేతలు అడ్డు చెప్పడంతో ఎన్నిక వాయిదా వేయించారు. తాజాగా శనివారం ఎన్నిక నిర్వహించగా.. 202 మందికి విద్యార్థుల తల్లిదండ్రులు 50 మంది హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు ఓటు వేస్తే రేషన్ కార్డు, పింఛన్ కట్ చేస్తామని టీడీపీ నేతలు బెదిరించడంతో తల్లిదండ్రులు హాజరు కాలేదు. కోరం లేకపోవడంతో ఎంఈఓ శోభరాణి ఎన్నికను మళ్లీ వాయిదా వేయించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓతో వాగ్వాదానికి దిగారు. ఇప్పటికే రెండు సార్లు వాయిదా అయ్యిందని, ఇలా అయితే ఎలా అంటూ ప్రశ్నించారు. ఈ విషయాన్ని గ్రామ నాయకులు సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తెచ్చారు. మరో సారి అలా కాకుండా ఎన్నిక జరపాలని ఎమ్మెల్యే ఎంఈఓకు సూచించారు. అవాంచనీయ సంఘటనలు జరుగకుండా కోసిగి సీఐ మంజునాథ్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇంటర్ విద్యార్థి మృతి కేసులో వీడిన మిస్టరీ

- అవమానం భరించలేక ఆత్మహత్య
- నలుగురి నిందితుల అరెస్ట్

ఆత్మకూరురూరల్: పట్టణానికి చెందిన ఇంటర్ విద్యార్థి అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. అవమాన భారంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు విచారణలో తేలింది. ఇందుకు కారకులైన నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణానికి చెందిన షేక్ అజ్మతుల్లా కుమారుడు వాహిద్ (17) ఈనెల 13వ తేదీన కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించగా కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేశారని తెలుసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ఈనెల 15వ తేదీన వాహిద్ పట్టణంలోని ఫైర్ ఆఫీస్ వద్ద గల బావిలో శవమై కనిపించాడు. నాలుగు రోజుల్లోనే కేసును పోలీసులు ఛేదించారు. తన కుటుంబంలోని యువతి పట్ల వాహిద్ చనువుగా ఉంటున్నాడని పటాన్ ఇంతియాజ్ అనే వ్యక్తి వాహిద్‌ను కిడ్నాప్ చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఇందుకు మదార్‌వలి, ముర్తుజావలి, వల్లెపు విక్రమ్ వాహిద్ కిడ్నాప్‌నకు సహకరించారు. దీంతో వారికోసం గాలించగా శనివారం కరివేన నుంచి నల్లకాల్వకు పోయే రహదారిలో కనిపించగా అరెస్ట్ చేశారు. ఆత్మకూరు పట్టణంలోని పాలకేంద్రం సమీపంలో పైనలుగురు కిడ్నాప్ చేసిన వాహిద్‌ను కొట్టడంతో పాటు బట్టలు ఊడదీసి అవమానించారని విచారణలో తేలింది. దీంతో అవమానం భరించలేని వాహిద్ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఇందుకు కారకులైన ఇంతియాజ్, మదార్‌వలి, ముర్తుజావలి, విక్రమ్‌పై కేసు నమోదు చేసి స్థానిక జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరు పరచగా 15 రోజుల రిమాండ్ విధించారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కర్నూలు (టౌన్): జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా పురస్కారాలు ఇచ్చేందుకు ఈనెల 9వ తేదీతో దరఖాస్తు గడువు ముగియగా, దానిని ఈనెల 24వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి. భూపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. వివరాలకు 08518 225419 సంప్రదించాలని కోరారు.

ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

- పెళ్లింట విషాదం


ప్రమాదంలో మృతి చెందిన దరగయ్య

గోనెగండ్ల: తెల్లవారితే మేనల్లుడి పెళ్లి.. అంత వరకు పెళ్లి పనుల్లో నిమగ్నమైన ఉన్న బోయ దరగయ్య కూరగాయలు తీసుకువచ్చేందుకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. మోటారు సైకిల్‌ను ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. దీంతో పెళ్లి ఇంట విషాద ఛాయలు అలుముకున్నాయి. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంజిహళ్లి గ్రామానికి చెందిన బోయ దరగయ్యకు భార్య బాలక్క, ఇద్దరు కుమారులు, ఒక కూమార్తె ఉన్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే దరగయ్య.. అక్క వెంకటేశ్వరమ్మ కుమారుడు దరగన్న పెళ్లి కావడంతో కూరగాయలు తీసుకువచ్చేందుకు గంజిహళ్లి నుంచి మోటారు సైకిల్‌పై శనివారం ఉదయం గోనెగండ్లకు బయలుదేరాడు. గోనెగండ్ల సమీపంలోని తుంగభద్ర దిగువ కాలువ మలుపు దగ్గర జీనియస్ గ్లోబల్ స్కూల్‌కు చెందిన బస్సు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో వాహనంపై ఉన్న దరగయ్య(35) ఎగిరి రోడ్డుపై పడటంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. అతివేగంగా బస్సును నడిపిన డ్రైవర్ కందనాతి షేక్ మాబువలి అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న దరగయ్య కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుని భార్య బాలక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

కొనసాగుతున్న సీఐలు, ఎస్ఐల బదిలీలు

కర్నూలు(టౌన్): రాయలసీమ నాల్గవ జోన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐల బదిలీలు కొనసాగుతున్నాయి. శనివారం రాత్రి జోన్–4 పరిధిలోని పలువురు సీఐలు, ఎస్ఐలకు స్థానచలనం కల్పించారు. అలాగే వీఆర్‌లో ఉన్న పలువురికి పోస్టింగులు కేటాయిస్తూ శనివారం రాత్రి కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పి.శేషయ్య	అన్నమయ్య జిల్లా	కర్నూలు వన్‌టౌన్ పీఎస్ (సీసీఎస్ అటాచ్డ్)
జి.నిరంజన్‌రెడ్డి	కర్నూలు వన్‌టౌన్	వీఆర్, కర్నూలు
జి.శంకర్ మల్లయ్య	ఎస్సీ, ఎస్టీ సెల్, అన్నమయ్య జిల్లా	ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు, కర్నూలు
ఎం.నాగశేఖర్	ఓర్వకల్లు ఔట్‌పోస్టు	పీసీఆర్, ఆదోని
ఎం.శ్రీనాథ్‌రెడ్డి	పీసీఆర్, ఆదోని	వీఆర్, కర్నూలు
ఎ.వేణుగోపాల్	వీఆర్, కర్నూలు	సైబర్ సెల్
కుచల శ్రీనివాసులు	వీఆర్, కర్నూలు	సీసీఎస్–1, నంద్యాల
నిరంజన్‌రెడ్డి	వీఆర్, కర్నూలు	సీసీఎస్–2, నంద్యాల
కె.మోహన్‌రెడ్డి	వీఆర్, కర్నూలు	సీసీఎస్–3, నంద్యాల
ఎ.ఆదినారాయణరెడ్డి	వీఆర్, కర్నూలు	డీటీసీ, నంద్యాల
కె.ఎర్రిసావలి	వీఆర్, కర్నూలు	స్పెషల్ బ్రాంచ్–2, నంద్యాల
పి.శంకరయ్య	వీఆర్, కర్నూలు	ఆర్ఎస్‌టీఎఫ్
ఎస్ఐ పేరు	**ప్రస్తుత స్థానం**	**బదిలీ స్థానం**
ఎం.కేశవ	ఎలక్షన్ సెల్	జూపాడుబంగ్లా పీఎస్
సి.శరత్‌కుమార్ రెడ్డి	వీఆర్, కర్నూలు	ముచ్చుమర్రి పీఎస్
డి.కిరణ్‌బాబు	వీఆర్, నంద్యాల	సీసీఎస్, కర్నూలు

పిస్తోల్‌తో కాల్చి.. కత్తితో పొడిచి!

- మిస్టరీ వీడిన యువకుడి హత్య కేసు
- కుటుంబ కలహాలతోనే బావను చంపిన బామర్ది
- ఇద్దరూ.. దొంగల ముఠాలో సభ్యులే
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు
- దర్యాప్తులో సంచలన చోరీ కేసులు వెలుగులోకి


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి

పాణ్యం: ఆరు రోజుల క్రితం పాణ్యం ఎస్సార్బీసీ కాల్వ సమీపంలోని కొండ ప్రాంతంలో హత్యకు గురైన యువకుడి కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఈ కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కుటుంబ కలహాలతో హత్య జరిగినప్పటికీ పోలీసులు లోతుగా దర్యాప్తుగా చేయగా దొంగల ముఠా ఆగడాలు బయటపడుతున్నాయి. కేసు వివరాలను పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి శనివారం మీడియాకు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం హుబ్లీ తాలూకా హొమినగహల్లీ గ్రామానికి చెందిన శ్యామ్ (32), అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణానికి చెందిన గోసంగి కోటేశ్వరరావు, ఆయన కుమారుడు గోసంగి సాగర్, శ్యామ్ తమ్ముడు సచిన్, రహిమాన్, మహ్మద్ బాషా, ఆటో మస్తాన్, సలీమ్, ఇంతియాజ్ గ్యాంగ్‌గా ఏర్పడి పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డారు. ఈ ముఠాపై ములకలచెరువు, కర్ణాటకలోని సందగుడి, విజయపూరి, గౌనపల్లి పోలీసు స్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలోనే దొంగల ముఠా చిత్తూరు జిల్లా పీలేరు పట్టణం ఒక వృద్ధురాలిని బెదిరించి బంగారు ఆభరణాలు దోచుకున్నారు. ఆ తర్వాత అందరూ కలిసి ఇదే జిల్లాలోనే ఓ ఇంటి యజమానిని తుపాకులు, కత్తులతో భయపెట్టి దోచుకున్నారు. ఆ తర్వాత శ్యామ్, గోసంగి సాగర్ కడపలో ఓ ఇంటి ముందు ఉన్న బైక్‌ను అహపరించారు. అనంతరం ఈనెల 11వ తేదీన కర్నూలులో శ్యామ్, రహిమాన్ కలిసి చైన్‌స్నాచింగ్ పాల్పడ్డారు. నంద్యాల వైపు వెళ్తూ సాగర్, శామ్ మద్యం తాగేందుకు పాణ్యం ఎస్సార్బీసీ కాల్వ సమీపంలోని కొండ ప్రాంతానికి చేరుకున్నారు.

అక్క జీవితం చిన్నాభిన్నం అయిందని..

శ్యామ్, గోసంగి సాగర్ ఇద్దరు బావబామర్దులు. శ్యామ్ చెల్లెలను సాగర్, సాగర్ అక్కను శ్యామ్ వివాహం చేసుకున్నారు. అయితే శ్యామ్ వలన అతని అక్క జీవితం చిన్నాభిన్నమై ఇరు కుటుంబాల మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ విషయంలో సాగర్ చిన్నాయన రవిశేఖర్‌ను శ్యామ్ కొట్టడం, సాగర్ భార్య విషయంలో తన తల్లిదండ్రులను బెదిరించడంతో సాగర్ మనసులో పెట్టుకున్నాడు. పాణ్యం సమీపంలో మద్యం తాగుతూ శ్యామ్‌ను చంపేందుకు అదే అదునుగా భావించిన సాగర్ తన వద్ద పిస్తోల్‌తో ఎడమ కణతిపై కాల్చాడు. తర్వాత గొంతుపై కత్తితో పొడవడటంతో శ్యామ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలంలో లభించిన సెల్ ఫోన్ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా దొంగల ముఠా ఆగడాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు సాగర్‌ను శనివారం తమ్మరాజుపల్లె డాబా వద్ద అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి బైక్, కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన ఇన్‌చార్జ్ సీఐ వంశీధర్, ఎస్ఐలు అశోక్, వెంకటసుబ్బయ్య, నరేంద్రకుమార్‌రెడ్డి, పోలీసులను అభినందించారు. కాగా హత్య జరిగిన సమయంలో ఎంత మంది ఉన్నారు? హత్యకు ఉపయోగించిన పిస్టోల్ ఎక్కడ దాచారో దర్యాప్తులో తేలాల్సి ఉంది.

అభ్యంతరాలు ఉంటే తెలపండి

కర్నూలు సిటీ: జిల్లా స్పోర్ట్స్ ఎక్సలెన్స్ స్కూల్ అవార్డుకు అత్యధిక పాయింట్లతో ఎంపికైన స్కూళ్లపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే నేటి సాయంత్రం 5 గంటలలోపు తగిన ఆధారాలతో ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయుల ద్వారా సమర్పించాలని డీఈఓ కాగిత శామ్యూల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ ఎక్సలెన్స్ స్కూల్ అవార్డుకు ఈ నెల 16వ తేదీలోపు వచ్చిన 8 దరఖాస్తులను ఫైవ్‌మెన్ కమిటీ పరిశీలించిందని పేర్కొన్నారు. వారు ఇచ్చిన పాయింట్ల మేరకు అవార్డుకు స్కూళ్లను ఎంపిక చేశామన్నారు. జెడ్పీ హైస్కూల్(మిలటరీ కాలనీ) అత్యధికంగా 101, మాచాని సోమప్ప జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల(ఎమ్మిగనూరు) 96, జెడ్పీ హైస్కూల్ బాలురు(కోసిగి)84, ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలురు(బీక్యాంపు కర్నూలు)73 , జెడ్పీ హైస్కూల్(మిదివేముల, ఓర్వకల్లు మండలం)68 , కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం(కృష్ణగిరి)40 , జెడ్పీహైస్కూల్(నందవరం)37 , ఏపీ మోడల్ స్కూల్(ఆస్పరి) 10 పాయింట్లు సాధించినట్లు డీఈఓ వెల్లడించారు.